సాక్షి
వికారాబాద్

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



చదువుతోనే గుర్తింపు

చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు.

8లో ▸



శాంతిభద్రతల పరిరక్షణకు..

శాంతి భద్రతలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని ఏసీపీ రంగస్వామి అన్నారు.

8లో ▸



బాల్యం బందీ..!

బలపం పట్టుకోవాల్సిన బడీడు పిల్లలు ఇటుక బట్టీల్లో కూలీలుగా కాలం వెళ్లదీస్తున్నారు.

9లో ▸

న్యూస్‌రీల్

కాశీ విశ్వనాథుడి సేవలో స్పీకర్



కాశీ విశ్వనాథుడి ఆలయం వద్ద స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

అనంతగిరి: మహా కుంభమేళా సందర్భంగా త్రివేణి సంగమంలో పవిత్ర స్నానమాచరించేందుకు వెళ్లిన శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ శనివారం కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయాధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం ఇచ్చారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం

కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

కుల్కచర్ల: బాలల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహనను పెంపొందించుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు మిషన్ వాత్సల్య కార్యక్రమంలో భాగంగా బాలల హక్కులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ... బాలలు తమ హక్కుల గురించి పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. ఏవైన ఇబ్బందులు తలెత్తిన సమయంలో ఉపాధ్యాయులు లేదా అధికారులకు తెలపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొంది.

ఉత్తమ జానపద గాయకుడిగా రాజశేఖర్



రాజశేఖర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

దోమ: ఉత్తమ జానపద గాయకుడిగా బొంపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ ఎంపికయ్యారు. శనివారం నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఈఓ యూవీ రత్నం, ప్రోగ్రాం డైరెక్టర్ దనాషి ఉషారాణి, హైకోర్టు అడ్వకేట్ జగదీశ్వర్‌రావు, కర్ణాటక సంగీత గాయకులు పుల్లూరి బాలసుబ్రహ్మణ్యం, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజశేఖర్ తెలంగాణ ఉద్యమంలో తన పాటతో ఎంతో మందిని ఆలోచింప జేశారని.. జానపద గాయకుడిగా ప్రజలను చైతన్యం చేస్తూ దేశ వ్యాప్తంగా తన గలాన్ని వినిపించారని ప్రశంసించారు. ఆయనకు మంచి భవిష్యత్ ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు.

ఆలయాభివృద్ధికి నిరంతరం కృషి

ఆలయ కమిటీ చైర్మన్ మైపాల్ రెడ్డి



వేలంలో పాల్గొన్న పాలకవర్గ సభ్యులు తదితరులు

కుల్కచర్ల: పాంబండ ఆలయాభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు వెళ్తామని పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆలయంలో తలనీలాలకు సంబంధించిన వేలం నిర్వహించారు. ఈ వేలంలో సజ్జ శ్రీనివాస్ రూ.2.85లక్షలకు సేకరణ హక్కు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. శివరాత్రి, ఆలయ బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి ఆలయ ఈఓ నరేందర్, పాంబండ ఆలయ ఈఓ బాలనర్సయ్య, అర్చకులు పాండుశర్మ, దశరథం, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయం ఎదుట భక్తజన సందోహం



అంగరంగ వైభవం.. అమ్మవారి రథోత్సవం

తేరు లాగి పరవశించిన భక్తజనం ● కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం

బొంరాస్‌పేట: భక్తుల కొంగు బంగారం.. కోరిన వరాలిచ్చే కల్పవల్లి.. పోలేపల్లి రేణుకా ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. జాతరలో మూడో రోజు శనివారం సాయంత్రం 5.40 గంటలకు రథోత్సవం(తేరు లాగడం) అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిమను రథంలో ఉంచి అమ్మా ఎల్లమ్మా.. కాపాడమ్మా.. కరుణించమ్మా అంటూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఈ ఏడాది రూ.14లక్షలతో తయారు చేయించిన రథాన్ని లాగుతున్న సమయంలో అమ్మవారి నామస్మరణతో పోలేపల్లి దద్దరిల్లింది.



అమ్మవారి రథం లాగేందుకు పోటీపడుతున్న భక్తులు

భక్తజన సందోహం

అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకునేందుకు లక్షలాదిగా తరలివచ్చారు. బుడగ జంగాలు, కురుమ, గొల్ల యాదవులు, బైండ్ల వారు ఆలయ ప్రాంతంలో జాగరణ చేస్తూ ఎల్లమ్మ తల్లి ఇతివృత్తాంతం ఆటపాటలతో తెలియజేశారు. ఆలయ చైర్మన్ జయరాములు, ఆలయ కమిటీ సభ్యులు వెంకటయ్యగౌడ్, లక్ష్మి, ఈఓ రాజేందర్ రెడ్డి, నిర్వాహకులు నర్సింహ, సింగర్ నర్సింహ తదితరులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారి ప్రధాన ఆలయం



జాతరలో రోకళ్లు కొనుగోలు చేసిన మహిళలు

ఆడపిల్లలు ఆటపాటల్లోనూ రాణించాలి

మహిళా శిశు సంక్షేమశాఖ ఇన్‌చార్జి ఉమాహారతి

ధారూరు: ఆడపిల్లలు చదువుతో పాటు ఆటపాటల్లోనూ రాణించాలని మహిళా శిశు సంక్షేమశాఖ ఇన్‌చార్జి, ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. బేటీ బచావో బేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కేజీబీవీల విద్యార్థినులకు నియోజకవర్గ స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు శిశు సంక్షేమశాఖ ఇన్‌చార్జి, ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆడపిల్లలు అన్నిరంగాల్లో రాణించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా కేజీబీవీల ఉపాధ్యాయులు, క్రీడల్లో గెలుపొందిన విద్యార్థినులు పాల్గొన్నారు.



కేజీబీవీ విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఉమాహారతి

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

బంట్వారం: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి అన్నారు. శనివారం ఆమె ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కింద ఎంపికైన కోట్‌పల్లి మండలంలోని ఎన్నారం ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ ముఖ్యమన్నారు. క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పాఠాలు చదివించి సామర్థ్యాన్ని అంచనావేశారు. ఎఫ్‌ఎల్‌ఎన్ పై ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. ఆమె వెంట ఎంఈఓ చంద్రప్ప, సీఆర్‌పీ నర్సింలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

తుక్కుగూడ: సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మున్సిపల్ కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా తుక్కుగూడ మున్సిపల్ కేంద్రంలో మార్చి 11న జిల్లా స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ హరగోపాల్ తదితర ముఖ్య నేతలు హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, పానుగంటి పర్వతాలు, దత్తు నాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు, దేవేందర్‌గౌడ్, బ్రహ్మచారి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నేతలు

జీవ వైవిధ్యాన్ని పరిరక్షించాలి

నందిగామ: జీవ వైవిధ్యాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మండల పరిధిలోని కన్హా శాంతి వనంలో తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు ఆధ్వర్యంలో ఈ నెల 20న ప్రారంభమైన జాతీయ యూత్ బయోడైవర్సిటీ సదస్సు శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటగా జీవ వైవిధ్య సదస్సు ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానికే దక్కిందని అన్నారు. ప్రస్తుతం అంతరించిపోతున్న ప్రకృతి, సహజ సంపద, జీవరాసులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువత ప్రకృతిని కాపాడటంతో పాటు జీవ వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వాలు సైతం అభివృద్ధి పేరిట ప్రకృతిని నాశనం చేయొద్దని, ప్రకృతిని, మానవ వనరులను కాపాడుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అడవులు, నీటి వనరులు, ప్రకృతి, పర్యావరణం దేవుడిచ్చిన వరాలని, వాటిని సంరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమని పేర్కొన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అంతకు ముందు జీవ వైవిధ్య అవగాహన, పరిరక్షణ, నిబద్ధతకు సంబంధించి జీవ వైవిధ్య హైదరాబాద్ డిక్లరేషన్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో 28 రాష్ట్రాలు, పలు కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 72 మంది విద్యార్థులు, ఎన్విరాన్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ అమద్ నాదిమ్, బయోడైవర్సిటీ బోర్డు సెక్రటరీ ఖాళీ చరణ్ పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే సెర్ప్



స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్

- కొత్త సంఘాలు నెలకొల్పుతూ మూతబడిన సంఘాలను పునరుద్ధరించండి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: సామాజిక సేవా రంగాల్లో మహిళా సంఘాల పాత్ర కీలకమని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసం సీఆర్పీల వ్యూహంపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ జిల్లాలకు చెందిన సీఆర్‌పీలు రెండు వారాలపాటు దోమ, వికారాబాద్, ధారూరు, మర్పల్లి, మోమిన్‌పేట్ మండలాల్లోని గ్రామాలను సందర్శించి స్వయం సహాయక సంఘాల బలోపేతానికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో ఏర్పాటు చేసిన సమీక్షకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికం నిర్మూలనే సెర్ప్ ప్రధాన ఉద్దేశమన్నారు. స్వయం సహాయక సంఘాలు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకుంటూనే సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు అవ్వాలని సూచించారు. సమాజంలో బాల్యవివాహాలు, విద్య, ఆరోగ్యం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. మహిళా సంఘాలు పొదుపు చేయడంతో పాటు బ్యాంకుల నుంచి పొందిన రుణాలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మహిళా సంఘాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ సంఘాలను నెలకొల్పడంతో పాటు మూతబడిన సంఘాలను పునరుద్ధరించే విధంగా అధికారులు, సంఘాల సభ్యులు కృషి చేయాలన్నారు. ఆసక్తి ఉన్న మహిళలకు టైలరింగ్లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశాలు నిర్వహించుకుంటూ పొదుపు, స్త్రీ నిధి, బ్యాంకు లింకేజీ రుణాలు, బ్యాంకులకు చెల్లించిన అప్పుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేసుకుంటూ పుస్తక నిర్వహణను చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీలు మహిళా సంఘాల బలోపేతానికి సంబంధించిన విషయాలను కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు నివేదికల ద్వారా వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్డీఓ శ్రీనివాస్, అదనపు డీఆర్డీఓ సరోజ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అలివేలు, డీపీఎం వీరయ్య, గ్రామ మహిళ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పాలనా నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: శిక్షణలో పాలనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–4 ఫలితాలతో పోలీసు శాఖలో నియమితులైన జూనియర్ అసిస్టెంట్‌లకు ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ పోలీసు అకాడమీలో ఆరు వారాల పాటు బేసిక్ ఇంట్రడక్షన్ ట్రెనింగ్ నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణలో 71 మంది ట్రెనీ జూనియర్ అసిస్టెంట్‌లు శనివారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలోని డీపీఓ విభాగాన్ని సందర్శించారు. డీపీఓలోని ఎ–సెక్షన్, పే సెక్షన్, బడ్జెట్ సెక్షన్, ప్రజావినతుల పరిష్కార విధానాలు, వివిధ విభాగాల మధ్య సమన్వయం తదితర అంశాలపై శిక్షణ పొందారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. పోలీసు శాఖలో పరిపాలన విభాగం ప్రధానమైనది అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, నూతన విధానాలను అవలంబించి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పనిచేయాలన్నారు. ఈ విభాగంలో పనిచేసేందుకు నైతిక విలువ, క్రమశిక్షణ, సమర్థత ముఖ్యమన్నారు. పోలీసు సిబ్బందికి ఎల్లపుడూ అందుబాటులో ఉండే విధంగా సత్వర సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ హనుమంత్‌రావు, ఆర్‌బీవీఆర్‌ఆర్ డీఎస్పీ భాస్కర్, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, బి–సెక్షన్ సూపరింటెండెంట్ మోహనప్ప, పే–సెక్షన్ సూపరింటెండెంట్ మీర్జా జావిద్ బేగ్, ఆర్‌ఐ డేవిడ్, విజయ్, ఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

బకాయి.. పేరుకుపోయి!

- భారీగా విద్యుత్ బిల్లుల పెండింగ్
- మెట్రోజోన్‌లో రూ.72.32 కోట్లు
- రంగారెడ్డి జోన్‌లో రూ.38.28 కోట్లు
- మేడ్చల్ జోన్‌లో రూ.12 కోట్లు
- వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో విద్యుత్ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. ఎప్పటికప్పుడు బిల్లులు జారీ చేసి, రెవెన్యూ కలెక్షన్ చేయాల్సిన ఇంజనీర్లు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో పెండింగ్ బిల్లులు పెరిగిపోతున్నాయి. గ్రేటర్ సర్కిళ్ల పరిధిలో 62 లక్షలకుపైగా గృహ, వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లు ఉండగా, వీటిలో ప్రస్తుతం మెట్రోజోన్ పరిధిలో 3,94,763 సర్వీసులు, మేడ్చల్ జోన్‌లో 2,24,816 సర్వీసులు, రంగారెడ్డి జోన్‌లో 2,84,902 సర్వీసులు సంస్థకు విద్యుత్ బిల్లు బకాయిపడ్డాయి. ఈ మేరకు అకౌంట్స్ విభాగం వందశాతం రెవెన్యూ కలెక్షన్స్ లక్ష్యంగా ప్రతి నెలా 'డి' లిస్ట్ (డిస్‌కనెక్షన్) తయారు చేసి, క్షేత్రస్థాయి ఇంజనీర్లకు అందజేస్తోంది. వీరు ఎప్పటికప్పుడు ఆయా వినియోగదారుల ఇళ్లకు వెళ్లి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వసూలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా బకాయిలు భారీగా పేరుకుపోయి సంస్థ ఆర్థిక సంక్షోభానికి కారణమవుతున్నారు.

ఆదేశాలు పట్టని సిబ్బంది

అత్యధికంగా మెట్రో జోన్ నుంచి రూ.72.32 కోట్లు రావాల్సి ఉంది. ఆ తర్వాత రంగారెడ్డిజోన్ నుంచి రూ.38.28 కోట్లు, మేడ్చల్ జోన్ నుంచి రూ.12 కోట్లకుపైగా బకాయి వసూలు కావాల్సి ఉంది. ఒక్క హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధి నుంచే రూ.51.06 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఈ బిల్లుల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆదేశించినప్పటికీ రంగారెడ్డి జోన్ ఇంజనీర్లు తప్ప మిగిలిన జోన్ ఇంజనీర్లు ఇప్పటి వరకు అటువైపు దృష్టి సారించలేదు. కేవలం మీటర్ రీడింగ్‌కే పరిమితం అవుతున్నారు. వందశాతం బిల్లులు వసూలు చేయాలనే డిస్కం ఆదేశాలను వారు సీరియస్‌గా తీసుకోకపోవడంతో ప్రతి నెలా బకాయిదారుల సంఖ్య పెరుగుతూనే ఉంది.



మూడు జోన్ల పరిధిలో బకాయిలు (రూ.కోట్లలో)

సర్కిల్	బకాయిలు
హైదరాబాద్ సౌత్	51.06
రాజేంద్రనగర్	22.58
హైదరాబాద్ సెంట్రల్	16.16
సైబర్‌సిటీ	7.70
వికారాబాద్	5.45
సంగారెడ్డి	4.28
హబ్సిగూడ	4.04
మేడ్చల్	3.73
సరూర్‌నగర్	2.55
సికింద్రాబాద్	2.05

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని టేకుల్‌కోడ్, రావులపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ అర్జున్‌కుమార్, ఏఈ ప్రవీణ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 10.30 గంటల నుంచి 12గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని చెప్పారు.

రేపు కంటి వైద్య శిబిరం

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఈ నెల 24న సోమవారం లయన్స్‌క్లబ్, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్ హరినాథ్‌నెహ్రూ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలున్న వారు ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కంటిలో శుక్లాలు ఉన్నవారికి ఎనుగొండ కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రికి ఉచిత రవాణా సౌకర్యంతో తీసుకెళ్లి ఆపరేషన్ అనంతరం మళ్లీ కొడంగల్ చేర్చుతామని చెప్పారు. కంటి పరీక్షలు, మందులు, భోజనం, రవాణా ఖర్చులు ఉచితమన్నారు. కంటి పరీక్షలకు వచ్చేవారు ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డులలో ఏదైనా గుర్తింపు కార్డు జిరాక్స్‌తోపాటు ఫోన్ నెంబర్‌ను వెంట తీసుకుని రావాలని సూచించారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

కుల్కచర్ల: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదామని పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి అన్నారు. శనివారం బండవెల్కిచర్ల పరిధిలోని పాంబండ రామలింగేశ్వర ఆలయంలో జీవమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమిలో కరిగే కవర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీవమిత్ర ఫౌండేషన్ కోఆర్డినేటర్ సాయిభరత్, నాయకులు గోవర్దన్ రెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

జిల్లా సాంస్కృతి సేన అధ్యక్షుడిగా శంకర్



రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న శంకర్

దోమ: జిల్లా సాంస్కృతిక సేన అధ్యక్షుడిగా దిర్సంపల్లి తండాకు చెందిన జర్కుల శంకర్‌ను రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రాగన్న ఆదేశాల మేరకు నియమించారు. శుక్రవారం నారాయణపేట జిల్లాలో నిర్వహించిన సీఎం సభలో జిల్లా డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. మరింత పట్టుదలతో పనిచేస్తూ, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులకు చేరేలా అవగాహన కల్పిస్తానన్నారు.

'తెలంగాణ కమల దళం' పుస్తకావిష్కరణ

సాక్షి, సిటీబ్యూరో: సీనియర్ జర్నలిస్టు, రచయిత్రి షేక్ హసీనా రాసిన 'తెలంగాణ కమల దళం' పుస్తకాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి శనివారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన పుస్తక రచయిత్రిని అభినందించారు. ఎంతో మంచి పుస్తకాన్ని సమాజానికి అందించారని పేర్కొన్నారు. మరిన్ని మంచి పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె



స్వామివారు



త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం

ఆమనగల్లు: మహాశివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించే బ్రహ్మోత్సవాలకు శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి, వీరభద్రస్వామి ఆలయం ముస్తాబవుతోంది. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ సమీపంలోని అయ్యసాగరం అటవీప్రాంతంలో కొలువైన స్వామివారి ఉత్సవాలను ఈ నెల 24 నుంచి మార్చి 2వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శివకోటి జపయజ్ఞ 27వ వార్షికోత్సవం కనుల పండువగా జరగనుంది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నారు.

కార్యక్రమాల వివరాలు

ఈ నెల 24న విఘ్నేశ్వరపూజతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. అనంతరం అభిషేకాలు, లలితా సహస్రనామ పారాయణం, దేవయజ్ఞం నిర్వహిస్తారు. 25న స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, శివకోటి యజ్ఞం, భగవద్గీత పారాయణం. 26న ప్రత్యేక అభిషేకాలు, రాత్రి 10 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, రుద్రాభిషేకం, 27న అభిషేకాలు, ప్రత్యేక పూజలు, వీరభద్రస్వామి నందికోత్సవ సేవ, అగ్నిగుండం. 28న ప్రత్యేక పూజలు, నందీశ్వరసేవ, చిన్న రథోత్సవం, మార్చి 1న స్వామివారి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, విష్ణు సహస్రనామ పారాయణం, పెద్ద రథోత్సవం. 2న చక్రతీర్థం, అమృతస్నానం, రుద్రాభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. 27న తెల్లవారు జామున నిర్వహించే అగ్నిగుండం కార్యక్రమంలో భక్తులు నిప్పులపై నడవడం విశేషం. కాగా.. అయ్యసాగరం బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కరుణాకర్‌రెడ్డి, బట్టు నర్సిరెడ్డి, పంచాక్షరి, శ్రీనునాయక్‌లు కోరారు.

రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు వద్దు

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

మొయినాబాద్‌రూరల్: రోడ్డుకు ఇరువైపులా నిర్వహించే వ్యాపారాలు ప్రమాదాలకు దారి తీస్తున్నాయని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొహిజుద్దీన్ అన్నారు. మండల పరిధిలోని జేబీఐటీ చౌరస్తా నుంచి హిమాయత్‌నగర్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులతో శనివారం వారు మాట్లాడారు. రోడ్డు పక్కన వ్యాపారాలు చేస్తుండడంతో వాటిని కొనేందుకు వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. సోమవారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు వ్యాపారులకు అవకాశం ఇస్తున్నామని, తర్వాత కూడా వ్యాపారాలు కొనసాగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రాజేందర్, మున్సిపల్ అధికారులు జమీల్, సుదర్శన్, వెంకటేశ్, మొయినాబాద్ పోలీసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



హిమాయత్‌నగర్ సమీపంలో రోడ్డు పక్కన హోటల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ తదితరులు

చదువుతోనే సమాజంలో గుర్తింపు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన పట్టణ కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపులే బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీఆర్ఆర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖపై ప్రత్యేక దృష్టి సారించాన్నారు. విద్యార్థులకు సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గురుకులాల్లో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివే తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పది, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపి మన ప్రాంతానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, తహసీల్దార్ ఆనంద్‌రావు, ప్రిన్సిపాల్ హరిత, సీనియర్ నాయకుడు పార్థసారథి పాల్గొన్నారు.

చల్లటి నీటితో స్నానం చేయించాలి



మందులు పంపిణీ చేస్తున్న వైద్య బృందం, యూత్ కాంగ్రెస్ నాయకులు

పశువైద్యాధికారి హారతిరామ్

తాండూరు రూరల్: వేసవిలో పశువులకు ప్రతీ రోజు రెండుసార్లు చన్నీటి స్నానం చేయించాలని బషీరాబాద్ పశువైద్యాధికారి హారతిరామ్ సూచించారు. శనివారం ఆయన మండల పరిధిలోని కరన్‌కోట్‌లో ఓ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరంలో పాల్గతొన్నారు. ఈ సందర్భంగా హారతీరామ్ మాట్లాడుతూ.. నాలుగు రోజులుగా చంద్రవంచ, కరన్‌కోట్, ఓగిపూర్, బెల్కటూర్ గ్రామాల్లో పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి వాటికి అవసరమైన మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. వేసవికాలం నేపథ్యంలో పశువులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. జంతువులు ఉండేగది కిటికీలకు గోనె సంచులని నీటిలో ముంచి కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో చెంగోల్ పశువైద్యాధికారిణి డాక్టర్ నాన్సి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్, మండల అధ్యక్షుడు సు ధాకర్, మాజీ వార్డు సభ్యులు అంజిలప్ప తదితరులున్నారు.

నిందితుడికి రిమాండ్

వృద్ధురాలిపై లైంగిక దాడి కేసు

యాచారం: మతిస్థిమితం లేని వృద్ధురాలిపై లైంగిక దాడి ఘటనలో నిందితుడిని శనివారం రిమాండ్‌కు తరలించారు. సీఐ నర్సింహారావు కథనం ప్రకారం.. కొన్నేళ్లుగా మాల్‌లోని ఎస్‌బీఐ ఎదుట మతి స్థిమితం లేని వృద్ధురాలు (70) నివసిస్తోంది. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం ఎరుగండ్లపెల్లి గ్రామానికి చెందిన పాలే శ్రీశైలం మాల్‌లోని ఓ హోటల్‌లో సప్లయిర్‌గా పనిచేస్తున్నాడు. డిసెంబర్ 9న వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడి తీవ్రంగా గాయపర్చాడు. సీసీ కెమెరాల ద్వారా ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడం.. పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో యాచారం పోలీసులు నిందితుడిని గుర్తించి రెండు రోజుల క్రితం అరెస్టు చేసి విచారించారు. శనివారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో స్థానిక పోలీసుల నిర్లక్ష్యంపై రాచకొండ సీపీ సుధీర్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులు సిద్ధమైనట్లు సమాచారం.

శతాధిక వృద్ధురాలి మృతి



బుచ్చమ్మ (ఫైల్)

దోమ: దోమ మండల పరిధిలోని మైలారం గ్రామ పంచాయతీలో గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బోయిని బుచ్చమ్మ (110) శుక్రవారం రాత్రి మృతి చెందింది. భర్త బోయిని పాపయ్య సుమారు 20 ఏళ్ల క్రితమే మృతి చెందగా, వీరికి వెంకటమ్మ, అంజిలమ్మ ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వెంకటమ్మకు ఇద్దరు కుమారులు ఉండగా, అంజిలమ్మకు ముగ్గురు కూతుర్లు, ముగ్గురు కుమార్లు ఉన్నారు. వీరందరికి కలిపి మునిమనుమళ్లు, మనుమరాళ్లు మొత్తం 32 మంది ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. బుచ్చమ్మ మృతితో మైలారం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. శనివారం గ్రామంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. కాగా ఆమె మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న పరిగి బార్ అసోషియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాది బాలముకుందం, ఏజీపీ డాక్టర్ జగన్మోహన్, మాజీ ఎంపీటీసీ రాములునాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు హన్మంతుముదిరాజ్ మృత దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతి తీరని లోటని పేర్కొన్నారు.

ఆలయంలో చోరీ వెండి వస్తువుల అపహరణ

అబ్దుల్లాపూర్‌మెట్: దేవాలయంలో వెండి వస్తువులు అపహరించుకుపోయిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆలయ పూజారి శ్రీరంగం శ్రీనివాస్ ప్రతి మంగళ, శనివారం పూజలు నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 18న మంగళవారం ఉదయం పూజలు నిర్వహించి ఆలయ తలుపులకు తాళం వేసి వెళ్లారు. తిరిగి శనివారం ఉదయం 7.30 గంటల సమయంలో ఆలయానికి వచ్చి చూడగా గర్భగుడి తలుపులకు వేసిన తాళం విరగ్గొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా దేవుళ్లకు సంబంధించిన వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



రాహుల్ కుమారి (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన గణేశ్ కుమార్తె రాహుల్ కుమారి (19) తన సోదరి మమత కుటుంబంతో కలిసి మామిడిపల్లి గ్రామానికి ఏడాది క్రితం వలస వచ్చింది. ఈ నెల 19న కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించిన రాహుల్ కుమారి అర్ధరాత్రి అనంతరం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: వృద్ధుడు అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రిజ్వాన్ కాలనీకి చెందిన సయ్యద్ తాహేర్(64)కు కొంత కాలంగా మతి స్థిమితం సరిగా ఉండకపోవడంతో కుటుంబసభ్యులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. దుకాణానికి వెళ్లి బీడీలు తెచ్చుకుంటానని చెప్పి బయటకు వెళ్లిన తాహేర్ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసిన ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు



కిరాణా దుకాణంలో తనిఖీలు చేపడుతున్న ఏసీపీ రంగస్వామి తదితరులు

ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్: శాంతి భద్రతలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని ఏసీపీ రంగస్వామి అన్నారు. పట్టణంలోని చౌరస్తా, బస్టాండ్, రైల్వేస్టేషన్, కేశంపేట రోడ్డు, ఫరూఖ్‌నగర్, ఎలికట్ట చౌరస్తాలో శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేట్టారు. కిరాణం షాపులు, దాబాలు, లాడ్జీలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ.. నిషేధిత గుట్కాలు, అనుమతి లేకుండా మద్యం విక్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి సమయాల్లో అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని, అలాంటి వారు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దాబాల్లో అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు చేయొద్దని సూచించారు. బెల్టు షాపుల్లో మద్యం అమ్మితే చర్యలు తీసుకుంటామని అన్నారు. లాడ్జీల యజమానులు అన్ని అనుమతులను తీసుకోవాలని, లాడ్జీలకు వచ్చే వారి పూర్తి సమాచారాన్ని తీసుకోవాలని, ఎలాంటి ఘటనలు చోటుచేసుకున్నా పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సీసీ కెమెరాలను తప్పనిసరి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తనిఖీల్లో డీఐ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ నర్సయ్య, కేశంపేట సీఐ నరహరి, ఎస్‌ఐలు శరత్‌కుమార్, విజయ్, బాలస్వామి, రవీందర్‌నాయక్, రాజ్‌కుమార్, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ పెట్టేసి..నిలువెల్లా దోచేసి!

గ్రేటర్‌లో పెరుగుతున్న ఆర్థిక నేరాలు

సాక్షి, సిటీబ్యూరో: 'రాత్రికి రాత్రే లక్షాధికారి అయిపోవాలి..కష్టపడకుండానే జేబు నిండిపోవాలి..తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే' ఆలోచనా ధోరణితో ఉన్నవారు నిలువెల్లా మోసపోతున్నారు. ఇటీవల కాలంలో గ్రేటర్‌లో ఆర్థిక నేరాలు పెరిగిపోవడానికి ఇలాంటి ధోరణులే కారణమని తేలింది. అధిక సంపాదనకు ఆశ పడి నగరవాసులు జేబు గుల్ల చేసుకుంటున్నారు.

రూటు మార్చిన నేరస్తులు

నేరస్తులు రూటు మార్చారు. గతంలో మాదిరిగా ఇళ్లలో దోపిడీలకు బదులుగా ఆర్థిక నేరాలతో సులువుగా కోట్లు సంపాదించేయాలని భావిస్తున్నారు. ఖరీదైన కార్లలో ప్రయాణం, లగ్జరీ లైఫ్ స్టయిల్, అందమైన బ్రోచర్లు, తీయని మాటలతో మోసాలకు పాల్పడుతున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో ఆర్థిక నేరాలు, నమ్మకద్రోహం, చీటీల పేరుతో వసూళ్లు వంటి నేరాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. అంతిమంగా మధ్యతరగతి ప్రజలు బలైపోతున్నారు. రూ.లక్షకు నెలకు రూ.10 వేలు వడ్డీ ఇస్తామని ప్రకటించినప్పుడు..ఇలాంటి వడ్డీ బ్యాంకులు ఎందుకు ఇవ్వలేకపోతున్నాయో గమనించాలి. ఇంటి పక్కవారు, స్నేహితులు కూడా అధిక వడ్డీ ఇస్తామంటే మోసమేనని గ్రహించాలి. లేకుంటే మీరిచ్చిన అసలు మొత్తం కూడా మీకు రాదు. ఇక భూములపై పెట్టుబడులు పెడితే మూడితంలు వస్తుందని చెప్పే వారినీ నమ్మకుండా..ముందస్తు నిర్ధారణ చేసుకోవాలి. లేకుంటే మోసపోక తప్పదు.

ఏటా 10 శాతం పెరుగుదల

నగరంలో ఏటా సగటున 10 శాతం కంటే ఎక్కువగా ఆర్థిక నేరాలు, చీటింగ్ కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా చీటీలు, పెట్టుబడులకు సంబంధించిన మోసాలు మూడింతలు పెరుగుతున్నాయి. ముందు డిపాజిట్లు కడితే తర్వాత వడ్డీతో కలిపి చెల్లింపులు, భూములపై పెట్టుబడులు పెట్టాలని నమ్మించి మోసం చేస్తున్న కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. గత మూడేళ్లలో నగరంలోని మూడు కమిషనరేట్లలో దోపిడీలు, దొంగతనాలు, సొత్తుకోసం హత్య వంటి అన్ని రకాల చోరీల కంటే ఆర్థిక నేరాలే అధికంగా నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

క్రిప్టో కరెన్సీ మోసగాడి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక రాబడి ఆర్జించవచ్చని అమాయకులను మోసం చేస్తున్న కేటుగాణ్ని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. చెన్నైకి చెందిన ఎస్.రామకృష్ణారెడ్డి తన సోదరుడితో కలిసి క్రిప్టో కరెన్సీ వ్యాపారులను మోసం చేసి, సులభంగా డబ్బు సంపాదించడానికి పథకం వేశాడు. ఈక్రమంలో బిట్‌కాయిన్ ఇండియా సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ పేరిట సంస్థను ప్రారంభించాడు. ట్రేడింగ్ కస్టమర్లు తన ప్లాట్‌ఫామ్ ద్వారా క్రిప్టో కరెన్సీని కొనుగోలు చేస్తే అధికంగా సంపాదించవచ్చని ఆశ పెడుతూ సామాజిక మాధ్యమాలలో ప్రచారం చేశాడు. ఈ ప్రకటనకు ఆకర్షితుడైన జూబ్లీహిల్స్‌కు చెందిన 35 ఏళ్ల బాధితుడు రూ.8.49 లక్షల విలువైన క్రిప్టో కరెన్సీని కొనుగోలు చేశాడు. కొంత కాలం తర్వాత ఇన్వెస్టర్ మొత్తం సొమ్మును నిర్వహణ రుసుము పేరుతో స్వాహా చేయడంతో జీరో బ్యాలెన్స్‌గా కనిపించింది. పైగా గడువు ముగిసినట్లు కనిపించింది. దీంతో బాధితుడు వెంటనే ఈ-మెయిల్ ద్వారా బిట్‌కాయిన్ ఇండియా వాలెట్ సపోర్ట్‌ను సంప్రదించగా..ఎలాంటి స్పందన లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు నమోదైన కేసులో సాంకేతిక ఆధారాలతో రామకృష్ణారెడ్డిని అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

శంషాబాద్: ఇరు కుటుంబాలు అంగీకరించకపోవడంతో ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్న ఓ ప్రేమజంట శుక్రవారం రాత్రి ఆర్‌జీఐఏ పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న ఇరు కుటంబాలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తంగా మారింది. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దగొల్కొండ గ్రామానికి చెందిన యువకుడు డబీల్‌గూడ గ్రామానికి చెందిన యువతి ఇద్దరు మేజర్లు ప్రేమించుకున్నారు. ఇరువైపు పెళ్లికి అంగీకారం లేకపోవడంతో శుక్రవారం ఉదయం ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. రక్షణ కోసం శంషాబాద్ ఏసీపీని కలిసేందుకు ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఇరు కుటుంబాలు ఆగ్రహంగా ఉండడంతో పోలీసులు వారిని చెదరగొట్టారు. అమ్మాయి మిస్సింగ్ కేసు మహేశ్వరం పీఎస్ పరిధిలో ఉండడంతో ప్రేమజంటను అక్కడికి తరలించేందుకు యత్నించినప్పటికీ పరిస్థితి సరిగా లేకపోవడంతో యువతిని సఖీ కేంద్రానికి పంపారు. యువకుడిని తండ్రి వెంట పంపడంతో పరిస్థితి సద్దుమణిగింది.

నవ్వుతూనే క్యాన్సర్‌ను జయించా

'కోపింగ్ విత్ క్యాన్సర్' పుస్తకావిష్కరణలో రచయిత రమేంద్ర కుమార్

కంటోన్మెంట్: నవ్వుతూనే క్యాన్సర్‌ను జయించానని ప్రముఖ రచయిత, స్టోరీ టెల్లర్, ఇన్‌స్పిరేషనల్ స్పీకర్ రమేంద్ర కుమార్ అన్నారు. క్యాన్సర్ బారిన పడి..తన స్వీయ అనుభవాలతో రచించిన 'కోపింగ్ విత్ క్యాన్సర్' అనే పుస్తకాన్ని శనివారం సికింద్రాబాద్‌లోని గురుస్వామి సెంటర్‌లో ఆవిష్కరించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ క్లాసికల్ డ్యాన్సర్ డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ చేతుల మీదుగా జరిగిన పుస్తకావిష్కరణలో, ది హిందూ మాజీ అసోసియేటివ్ ఎడిటర్ సోమశేఖర్‌తో పాటు రమేంద్ర కుమార్ కుటుంబ సభ్యులు, వివిధ రంగాల్లో ప్రముఖులైన వ్యక్తులు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేంద్ర కుమార్ మాట్లాడుతూ 2021 నవంబర్ 29న తాను క్యాన్సర్ బారిన పడినట్లు తేలిందన్నారు. ఒక్కసారిగా తన కాళ్ల కింద భూమి కదిలినట్లయిందన్నారు. అయితే తన సతీమణి మాధురి, కుమార్తె అంకిత ఇతర కుటుంబ సభ్యులు ఇచ్చిన మనోధైర్యంతో చికిత్స తీసుకున్నానని అన్నారు. తాను బతకడం కష్టమని డాక్టర్లు నిర్ధారణకు వచ్చిన సమయంలో, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం డాక్టర్లను సైతం ఆశ్చర్యపరిచిందన్నారు. ముఖ్యంగా తన కుమార్తె అంకిత తనకు ఎంతో ధైర్యాన్ని అందించిందన్నారు. అంతకు ముందు ఎందరికో మనోధైర్యాన్ని ఇచ్చేలా స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఇచ్చిన తాను, వ్యక్తిగతంగా తనకు తాను నిభాయించుకున్నానని అన్నారు. షోలే సినిమాలోని గబ్బర్ సింగ్ చెప్పిన 'జో డర్ గయా..వో మర్ గయా' డైలాగ్‌తో పాటు పుష్ప సినిమాలోని 'ఝుకేగా నహీ' డైలాగ్ తనకు స్ఫూర్తినిచ్చాయన్నారు. దాదాపు ఆరు నెలల చికిత్స అనంతరం తాను క్యాన్సర్‌ను జయించగలిగానన్నారు. 'మేనేజింగ్ ఎ ఫ్రీ ట్యూమర్ విత్ హ్యూమర్' అనే వ్యాక్యాన్ని నమ్ముతూ తనలాంటి వారికి స్ఫూర్తి కలిగించేందుకే పుస్తకం రాశానన్నారు.

మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్న వ్యాపారులపై కేసు

బంజారాహిల్స్: మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్న వ్యాపారిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.10లోని వెంకటగిరి ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా కె.వెంకటేశ్వరరావు అనే వ్యాపారి గత కొంత కాలంగా తన కుమారుడితో కలిసి మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఇక్కడ దాడులు చేసి మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తుండగా వెంకటేశ్వరరావును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇక్కడ సిగరెట్లు విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో పోలీసులు మాటు వేశారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థి (15) ఇక్కడ సిగరెటు కొనుగోలు చేసి పట్టుబడ్డారు. వెంటనే పోలీసులు సోదాలు నిర్వహించి ఖరీదైన సిగరెట్లను పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. అలాగే గంధం ప్రమీల కూడా ఇదే ప్రాంతంలో సిగరెట్లు మైనర్లకు విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. సుమారు రూ.6 వేలు విలువ చేసే ఈ సిగరెట్లను సీజ్ చేశారు. ఇదిలా ఉండగా యాంటీ నార్కోటిక్ బ్యూరోకు ఇటీవలనే ఫిర్యాదు కూడా అందింది. దీంతో సీఐ లాల్‌మదార్, ఎస్ఐ వెంకటరమణ తదితరులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి వీరిపై కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.